క్లుప్తంగా

పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు పోతన్న

విజయనగరం టౌన్: నగరంలోని గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జయంతి స్మారక గ్రంథాలయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాహితీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ పీవీఎల్ సుబ్బారావు రాసిన ఆవేదన.. నివేదన(పంచపదులు) పుస్తకాన్ని గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొంగలి పోతన్న ఆవిష్కరించారు. అనంతరం రచయిత, ఆయన రచనల్లోని గొప్పదనాన్ని వక్తలు, కార్యక్రమ నిర్వాహకులు ప్రశంసించి, సన్మానించారు. ఆ తర్వాత కవి, విమర్శకులు మానాపురం రాజా చంద్రశేఖర్, కవయిత్రి మానాప్రగడ సాహితి, పెద్దాడ సాయిసూర్య సుబ్బలక్ష్మి(చెన్నై)లు పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జీవీ శ్రీనివాస్, కార్యదర్శి షేక్ గౌస్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్ర చికిత్సకు 20 మంది ఎంపిక



వృద్ధురాలి కళ్లను తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన నేత్ర వైద్య శిబిరానికి హాజరైన 180 మందిలో వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 20 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి హాజరైన ప్రతి ఒక్కరి కళ్లను వైద్య సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేసి, ఏవైనా సమస్యలుంటే చెప్పి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టొంపల సీతారాం, స్వామి కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ సర్కిల్ పరిధిలోని విజయనగరం రూరల్, గంట్యాడ పోలీస్‌స్టేషన్‌ల సిబ్బందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు శనివారం చేసినట్లు విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు తెలిపారు. విజయనగరానికి చెందిన మ్యాక్సీ విజన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వారు వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

ఓటర్లను చైతన్యపరచడమే లక్ష్యం

శృంగవరపుకోట: ఓటర్లను చైతన్యపరచి వారికి తమ హక్కులు, విధులు, బాధ్యతలను తెలియచెప్పడమే లక్ష్యంగా ఓటరు అక్షరాస్యత వేదిక పని చేస్తోందని వేదిక అధ్యక్షుడు సూర్యారావు తెలిపా రు. ఓటరు అక్షరాస్యత వేదిక ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి స్థానిక లైబ్రరీలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వైద్యులు ఆర్.త్రినాధరావు, పి. వరలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. అనంతరం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఓవరాల్ విజేతలైన జి.భవిష్య, బి.తేజస్విని, బి.ఊహలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డి.శ్రీధర్, మోహన్‌రావు, చిన్నికృష్ణ, ఎల్.సాంబమూర్తి, తాతారావు, బి.అప్పారావు, పి.శ్రీనివాసరావు, మేఘన, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతుల పంపిణీ

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెంలో కృష్ణాష్టమి సందర్భంగా శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో గరివిడి జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు క్విజ్ మాస్టర్ కర్రి రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తర్వాతి స్థానాల్లో గుర్ల, విశాఖపట్నం జిల్లా మద్దిలపాలెం, విజయనగరానికి చెందిన సింధూరీ రీడింగ్ రూమ్, విశాఖపట్నం జిల్లా అక్కిరెడ్డిపాలెం జట్లు నిలిచాయ ని చెప్పారు. అనంతరం విజేతలకు నగదు బహుమ తులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిక్కాన దేముడు, కోన నాగరాజు, నల్ల శ్రీరాములు, తిక్కాన గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ చికిత్సలు

వేపాడ: వర్షాకాలంలో పశువుల సంరక్షణపై పాడిరైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి కోరాడ గాయత్రి సూచించారు. మండలంలోని కుమ్మపల్లిలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 పశువులకు చికిత్స అందించారు. అలాగే వర్షాకాలంలో పశువుల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గోతులతో ఇక్కట్లు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఆర్‌ఓబీ వద్ద నిర్మించిన తాత్కాలిక రోడ్డంతా గోతులేర్పడడంతో వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వానాకాలం..జరభద్రం!

- వర్షాకాలంలో మారుతున్న వాతావరణం
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- జలుబు, జ్వరం, దగ్గు రాకుండా జాగ్రత్త పడాలి
- ఆరోగ్య సమస్యలు వస్తే వైద్యుడిని సంప్రదించాలి



పూసపాటిరేగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది(ఫైల్)

పూసపాటిరేగ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయి. ఏ గ్రామం చూసినా జ్వరం, జలుబు, దగ్గు, ఆయాసం తదితర సమస్యలతో బాధపడేవారే అధికంగా కనిపిస్తారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆస్తమా, గుండె, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడే వారు అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. వర్షాల వల్ల వరదల ద్వారా నీటి ప్రవాహం ఒక చోట నుంచి మరొక చోటుకు ప్రయాణిస్తుండడం వల్ల భూగర్భజలం మారే అవకాశం ఉంటుంది. ఎప్పుడూ ఒకేలా ఉండే నీరు వానాకాలంలో ఒక్కసారిగా మారుతుంది. ఇలాంటి నీటిని తీసుకోవడం ద్వారా అంతవరకు ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిలో రోగ నిరోధక శక్తి తగ్గి, ఆరోగ్య సమస్య సంభవిస్తుంది. ఈ నేపథ్యంలో ఏదైనా సమస్య కనిపించిన వెంటనే ఆస్పత్రికి సంప్రదించి సకాలంలో చికిత్స తీసుకుంటే ఆరోగ్యవంతులుగా తిరిగి తయారవ్వచ్చని వైద్యులు సలహా ఇస్తున్నారు.

రోజుకు 250 మంది ఆస్పత్రికి..

నెల్లిమర్ల నియోజకవర్గంలోని పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ, నెల్లిమర్ల మండలాల్లో మొత్తం 145 గ్రామాలు ఉండగా, ఆయా మండలాల్లోని ప్రజలకు వైద్యసేవల కోసం ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో రోజుకు 250 మంది వరకు వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారిలో అధికంగా డయేరియా, జలుబు, దగ్గు, జ్వరం, దురదలతో బాధపడేవారే ఎక్కువగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ప్రస్తుతం చాలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వసతులు, సకాలంలో వైద్యసేవలు అందకపోవడంతో దగ్గరలోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టిసారించకపోవడంతోనే తమకు ఈ దుస్థితి అని పలువురు రోగులు వాపోతున్నారు.



పూసపాటిరేగ పీహెచ్‌సీ

సర్కారు ఆస్పత్రుల్లోనే వైద్యం చక్కగా అందితే తామెందుకు ప్రైవేటు వైద్యుల వద్దకు వస్తామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అవసరమైన చోట సదుపాయాలు మెరుగుపరచాలని, పేదలకు వైద్యం బాగా అందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

అపారిశుధ్యం వల్లే రోగాలు ప్రబలుతున్నాయి. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఆహారం తినే ముందు తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. వేడి, చల్లని పదార్థాలు వెంటనే తినవద్దు. ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు వెంటనే వైద్యుడిని కలిసి పరీక్షించుకోవాలి. –ప్రమీలాదేవి, వైద్యాధికారిణి, పీహెచ్‌సీ, పూసపాటిరేగ

కాచిచల్లార్చిన నీరు తాగాలి..

కాచిచల్లార్చిన నీరు తాగాలి. ఇలా చేస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవు. ప్రస్తుతం మారుతున్న చల్లని వాతావరణానికి జలుబు, జ్వరం, దగ్గు, దురదలు వచ్చే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లే.

–కృష్ణచైతన్య, వైద్యుడు, పూసపాటిరేగ

వచ్చే ఏడాది నాటికి..
సెంచూరియన్‌లో నానో చిప్‌ల తయారీ

- సెంచూరియన్ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ యూనివర్సిటీలో వచ్చే ఏడాది నాటికి ఏడు రకాల నానో చిప్‌ల తయారీ జరుగుతుందని, ఆ దిశగా విద్యార్థులంతా కృషి చేస్తున్నారని వర్సిటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు తెలిపారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది భారత్ తొలిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో సెమీ కండక్టర్ చిప్‌ను తయారు చేస్తుండగా, సెంచూరియన్ వర్సిటీ విద్యార్థులు కూడా చిప్‌ల తయారీకి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని, ప్రతి ఇంటా ఒక పారిశ్రామికవేత్త ఉండాలని ఆయన ఆకాంక్షిస్తున్నారన్నారు. రాష్ట్రంలో రూ.500 కోట్ల వ్యయంతో సెమి కండక్టర్ ప్లాంట్ తయారీకి పారిశ్రామికవేత్తలు ముందుకురావడం అభినందనీయమన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని, ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి, రిజిస్ట్రార్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.



స్టాల్ ప్రారంభిస్తున్న సెంచూరియన్ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు డీఎన్ రావు

పెండింగ్ బిల్లుల విడుదల

లక్కవరపుకోట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గతంలో నిర్వహించిన మినీ గోకులాలు, కాలువలు, సీసీ రోడ్డులకు సంబంధించి ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేసింది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తన స్వగృహం వద్ద లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఈఎస్ పీడీ శారదాదేవి, పంచాయతీరాజ్ డీఈ స్వామినాయుడు, ఐదు మండలాలకు చెందిన ఉపాధిహామీ ఏపీఓలు పాల్గొన్నారు.

కోనూరులో కొట్లాట

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు గ్రామంలో వినాయక విగ్రహం ఏర్పాటు విషయమై వైఎస్సార్ సీపీ, టీడీపీ వర్గాల మధ్య శనివారం వాగ్వాదం చోటుచేసుకుంది. ఇది క్రమంగా కొట్లాటకు దారితీసింది. గ్రామంలోని మంత్రివీధిలో వినాయకుడి ఏర్పాటు విషయమై జరిగిన కొట్లాటలో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నారు.

వెండర్స్ సమావేశం

డెంకాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెండర్స్ సమావేశం శనివారం నిర్వహించారు. 2014–19 సంబంధించి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల పెండింగ్ నిధులు మంజూరు చేయడం జరిగిందని ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, ఈఈ రతన్ కుమార్, డీఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి సందడి



ఉట్టిని కొట్టేందుకు పోటీపడుతున్న యువకులు



సీతారామునిపేట శ్రీకృష్ణ మందిరంలో పూజలు చేస్తున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములునాయుడు



నెల్లిమర్లలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



భోగాపురంలో ఊరేగింపులో ఆకట్టుకున్న శ్రీకృష్ణ సత్యభామల బళ్లవేషాలు

వాడవాడలా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణుడి పుట్టినరోజే ఈ కృష్ణాష్టమి. ఏటా శ్రావణ మాసంలోని కృష్ణపక్షంలో వచ్చే అష్టమి తిథి రోహిణి నక్షత్రం రోజున ఈ ఉత్సవాలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా మహిళలు వేకువజామున పవిత్ర స్నానమాచరించి, శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం యువత వీధుల్లో ఉట్టి కొట్టే ఉత్సవం నిర్వహించి, సందడి చేశారు. కొన్నిచోట్ల చిన్నారుల రాధాకృష్ణుల వేషధారణలు, మరికొన్ని చోట్ల రాధాకృష్ణుల బళ్లవేషాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

–విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్



పూసపాటిరేగ: రాధాకృష్ణుల వేషధారణలతో అలరించిన చిన్నారులు



ఉట్టి కొట్టేందుకు ఉత్సాహంగా ఉరుకుతున్న యువకుడు



విజయనగరం టౌన్: గాజులరేగలో గోపీకృష్ణుల వేషధారణలో చిన్నారులు



డార్మిటరీ ప్రారంభమెప్పుడో?

పూసపాటిరేగ మండలం, కొప్పెర్ల గురుకుల పాఠశాలలోని డార్మిటరీ(వసతిగృహం) భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. భవన నిర్మాణం చేపట్టి, నెలలు గడుస్తున్నా ప్రారంభించకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మైలాన్ పరిశ్రమ సీఎస్‌ఆర్ నిధులతో కొత్తగా నిర్మించిన ఈ భవనంలోనే వంటగది, విద్యార్థుల వసతిగదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇరుకు గదుల నుంచి విశాలమైన గదుల్లోకి ఎప్పుడు వెళ్తామా అని విద్యార్థులంతా ఎదురు చూస్తున్నారు. నిర్మించారు కానీ ప్రారంభించడం మరిచారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. –పూసపాటిరేగ

యువత సన్మార్గంలో నడవాలి



పాటల పోటీల్లో పాల్గొన్న క్రీస్తు ఆరాధకులు

విజయనగరం టౌన్: యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా సన్మార్గంలో నడవాలని పాస్టర్ అలజంగి రవికుమార్ కోరారు. ఫ్రీడమ్ ఇన్ క్రైస్ట్ యూత్ రిట్రీట్ కార్యక్రమాల్లో భాగంగా స్థానిక యేసు ప్రేమాలయం చర్చిలో క్రీస్తు ఆరాధన పాటల పోటీలు శనివారం నిర్వహించారు. యూత్ ఫర్ జీసస్ బృందం ఏసుప్రభువును స్తుతిస్తూ చేసిన గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. అనంతరం యువతను ఉద్దేశించి, పాస్టర్ ప్రసంగించారు. ప్రస్తుత ప్రపంచంలో యువతీ యువకులు ఫ్యాషన్ మాయలో పడి చెడు అలవాట్లు అలవర్చుకుని జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, ప్రతిఒక్కరూ మంచి నడవడిక కలిగి ఆదర్శవంతమైన జీవనం సాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ఎస్.స్వరూప్, డాక్టర్ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు. పాటల పోటీల్లో విజయనగరం సిమ్స్ చర్చి, దాసన్నపేట చర్చిలు వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందగా, బైబిల్ క్విజ్ పోటీల్లో ఇమ్మానుయేల్ బాప్టిస్ట్ చర్చి (చిలకలపల్లి), గ్రేస్ గాస్పల్ చర్చి, బైబిల్ మిషన్ చర్చిలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సహకార సంఘం సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ పీఏసీఎస్ వద్ద సమాచార హక్కు చట్టంపై శనివారం అవగాహన కల్పించారు. జిల్లా సహకార అధికారి పి.రమేష్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొని, చట్టం గూర్చి తెలిపారు. ఈ చట్టం ప్రకారం వ్యక్తిగత స్వేచ్ఛ, భద్రతకు భంగం కలిగించే సమాచారం మినహా మిగతా ఏ సమాచారాన్ని కోరినా అధికారులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం పనితీరులో జవాబుదారీతనానికే ఈ చట్టాన్ని 2005లో చేయడం జరిగిందన్నారు. దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని 30 రోజుల కాలవ్యవధిలో ఇవ్వాలని, లేకుంటే సంబంధిత అధికారులకు దరఖాస్తును బదలాయించాలన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఈ చట్టంపై అవగాహన పెంచుకుని, అవసరమైన సమాచారాన్ని పొందాలని తెలిపారు. అనంతరం ర్యాలీ చేపట్టి, చట్టంలోని అంశాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ సీఈఓ సన్యాసప్పుడు, ఇన్‌చార్జ్ సీఈఓ సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ఆదర్శనీయం

విజయనగరం అర్బన్: స్వాతంత్య్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ఆదర్శనీయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గౌతు లచ్చన్న జయంతి శనివారం నిర్వహించారు. మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లు గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేశారు. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు గౌతు లచ్చన్న అని, ఆయనో గొప్ప సామాజిక కార్యకర్త అని, ప్రజాసమస్యలపై చేసిన పోరాటమే ఆయనను ప్రజల హృదయాల్లో నిలిచేలా చేసిందన్నారు. ప్రతిఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని జీవించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారిణి జ్యోతిశ్రీ, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డీఈఓ మాణిక్యంనాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ రామారావు, తూర్పుకాపు చైర్మన్ యశస్వి తదితరులు పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్, కలెక్టర్ అంబేడ్కర్ తదితరులు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

విజయనగరం టౌన్: నగరంలో ఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవీ ఆర్యవైశ్య సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐఐటీ, జేఈఈ మెయిన్స్, సీఏ, నీట్, ఈ–సెట్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి శనివారం ప్రతిభాపురస్కారాలు అందజేశారు. అలాగే వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని అభినందిస్తూ వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు రవ్వా శ్రీనివాస్, కోశాధికారి ఆరిసెట్టి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు
స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో
గౌ॥రాష్ట్ర మంత్రివర్యులు
చేతుల మీదుగా
ఉత్తమ అధికారిణిగా ప్రశంసా పత్రాన్ని
స్వీకరించిన శుభసందర్భంగా
హార్దిక శుభాకాంక్షలు
శ్రీమతి కె.నీలిమ గారు
వ్యవసాయ అధికారిణి
పూసపాటిరేగ మండలం
కార్యాలయ సిబ్బంది
వ్యవసాయ కార్యాలయం
పూసపాటిరేగ

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com